



సీఎం ప్రచారం..

శేరిలింగంపల్లి తారానగర్‌లో చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేశారు. ఈ కార్నర్ మీటింగ్‌కు భారీ ఎత్తున హాజరైన ప్రజలు.
– శేరిలింగంపల్లి

‘ఎన్‌సీపీహెచ్’ బాధిత గర్భిణికి ప్రసవం

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆస్పత్రిలో విజయవంతం



ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆసుపత్రిలో పేషెంట్‌తో వైద్యులు

రాయదుర్గం: ‘నాన్–సిరోటిక్ పోర్టల్ హైపర్ టెన్షన్’ (ఎన్‌సీపీహెచ్)తో బాధపడుతున్న 30 ఏళ్ల గర్భిణీకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రసవం చేసేలా డాక్టర్ల బృందం విజయవంతం చేసింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆసుపత్రి వైద్య బృందం ఈ అంశాన్ని పరిశీలించి ప్రసవం విజయవంతం చేసేందుకు సమిష్టిగా కృషి చేశారు. బుధవారం స్టార్ ఆసుపత్రి కన్సల్టెంట్ హెపటాలజీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ హిమబిందు వివరించారు. 30 ఏళ్ల గర్భిణీకి ఆర్సీతో గ్రేడ్–3 వేరిస్‌లు, విస్తరించిన ప్లీహం, తక్కువ ప్లేట్‌లెట్ కౌంట్ కేవలం 35వేలు ఉన్నట్లు కనుగొన్నారు. రేయిన్‌బో ఆసుపత్రి, స్టార్ ఆసుపత్రిలకు చెందిన మల్టీ డిసిప్లినరీ వైద్య బృందం ఆమె పరిస్థితిని అంచనా వేసి దానితో సంబంధం ఉన్న ప్రమాదాల గురించి చర్చించారు. ఆమె ఇదివరకు అధిక రక్తస్రావం, స్పొటేనియర్ అబార్షన్, ప్రీమెచ్యూర్ డెలివరీ వంటి సంభావ్య సమస్యలను ఎదుర్కొందని వైద్య బృందం తెలిపింది ఆమె రక్తం గడ్డకట్టే స్థాయిలు, పిండం హార్ట్‌బీట్ రేటు శిశువు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. చివరకు ప్రసవ సమయం దగ్గరపడే సమయానికి ఆమెకు సిజేరియన్ పూర్తి చేశారు. అధిక రక్తస్రావం నివారించేందుకు చికిత్స సమయంలో ఆ తర్వాత పరిస్థితులకు అనుకూలంగా మార్గనిర్దేశం చేసేందుకు వైద్యులు థ్రోంబోలాస్టోగ్రఫీని ఉపయోగించారు. దీంతో శస్త్ర చికిత్స నుంచి తల్లి, బిడ్డ ఇద్దరూ మంచి ఆరోగ్యంతో బయట పడ్డారు.

చేవెళ్లలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం చందానగర్ డివిజన్ పరిధిలో శంకర్‌నగర్, భవానీపురంలో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. పార్టీ రెండుసార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని వారిని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు. కేసీఆర్‌ను ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని ప్రజలకు వివరిస్తూ.. మోసం చేసే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయొద్దన్నారు. ప్రతి ఒక్కరు బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలన్నారు. మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

సీఎం సమక్షంలో చేరిన మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి



సీఎంతో కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ బుధవారం చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆయన ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కరుణాకర్‌గౌడ్, కుమార్‌యాదవ్, రాంచందర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, వెంకట్‌రావు, రవీందర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్‌కు షాక్..

గచ్చిబౌలి: కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం రాత్రి హమీద్ పటేల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. శేరిలింగంపల్లి డివిజన్‌లో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ల సంఖ్య నాలుగుకు చేరింది. మరికొంత మంది చేరే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, ఆయన భార్య, హఫీజ్‌పేట్ కార్పొరేటర్ కాంగ్రెస్‌లో చేరారు. జగదీశ్వర్‌గౌడ్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. 54 వేల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిపై బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ గెలుపొందిన విషయం తెలిసిందే. గ్రేటర్ ఎన్నికల్లో గచ్చిబౌలి డివిజన్ మినహా మిగతా 9 డివిజన్లలో బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. కొద్ది రోజుల క్రితం ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గెలుపునకు శేరిలింగంపల్లి నియోజకవర్గంపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి పెట్టింది. బీఆర్ఎస్, బీజేపీ నాయకులను భారీ సంఖ్యలో చేర్చుకుంటుందని సమాచారం.

పింఛన్ పత్రాలు అందజేత

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పీఎఫ్ కార్యాలయంలో ఏప్రిల్ నెలలో భాగంగా 31 మందికి పింఛన్లు మంజూరు కాగా 14 మందికి పింఛన్ మంజూరు పత్రాలను బుధవారం అందజేశారు. ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ, ప్రాంతీయ కార్యాలయాల సంస్థ తమ చందాదారులకు, పింఛన్‌దారులకు చేరువయ్యేటట్లు ప్రయాస్ పథకంలో భాగంగా పదవీ విరమణ పొందినవారికి నెలలోపు పింఛన్ మంజూరు పత్రాలను అందజేస్తామన్నారు.

పార్కులో కనీస వసతులేవి.. ?

అభివృద్ధికి నోచుకోని రాజేందర్‌రెడ్డి నగర్ పార్కు ● పట్టించుకోని సంబంధిత అధికారులు



చందానగర్ డివిజన్ పరిధిలోని రాజేందర్‌రెడ్డినగర్ పార్కు



హఫీజ్‌పేట్: కాలనీ వాసులకు వేసవికాలం దృష్ట్యా ఆహ్లాదకరం కోసం సేదతీరడానికి పార్కులకు వెళ్తుంటారు. చందానగర్ డివిజన్ పరిధిలోని రాజేందర్‌రెడ్డి నగర్ పార్కు అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

కబ్జాకు యత్నం..

గతంలో పార్కుకు ప్రహరీ లేక కబ్జాదారులు కబ్జా చేసేందుకు యత్నించినప్పుడు పలు దిన పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు హుటాహుటిన పార్కు చుట్టు ప్రహరీ నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పార్కులో కనీస వసతులు కల్పించలేదు.

వ్యర్థాలకు నిలయంగా..

పార్కులో ఎడారిగా మారడంతో చెత్త చెదారం వేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు నగరంలోని పార్కులను అభివృద్ధి చేస్తున్న సందర్భంగా రాజేందర్‌రెడ్డి నగర్ పార్కును కూడా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. చిన్నారులకు ఆటలు ఆడుకునేందుకు కనీస ఆట వస్తువులు లేవు. పచ్చదనంగా ఉండాల్సిన పార్కు పచ్చదనానికి నోచుకోవడం లేదని స్థానికులు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు.

- పార్కులోకి వచ్చే కాలనీవాసుల కోసం కనీస వసతులు కల్పించాలి.
- పార్కులో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించి పచ్చదనంతో నింపాలి
- చిన్నారులు ఆడుకోవడానికి కొత్త ఆట వస్తువులు ఏర్పాటు చేసి, వృద్ధులు సేద తీరడానికి బల్లలు ఏర్పాటు చేయాలి.
- కాలనీ వాసుల కోసం ఓపెన్ జిమ్‌లు, టాయిలెట్స్, తాగునీటి ట్యాంకును నిర్మించాలి.

పార్కును అభివృద్ధి చేయాలి..



పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి. కాలనీవాసులకు సేదతీరడానికి పార్కు ఎంతో ఉపయోగం. పార్కులో కనీస వసతులు కల్పించాలి. నిరుపయోగంగా ఉన్న పార్కును పచ్చదనంతో నింపి ఆహ్లాదరకమైన వాతావరణంలోకి తీసుకొచ్చే విధంగా అధికారులు కృషి చేయాలి.
– అశోక్, రాజేందర్‌రెడ్డి నగర్

ఆట వస్తువులను ఏర్పాటు చేయాలి..



రాజేందర్‌రెడ్డినగర్‌లో ఉన్న పార్కుల్లో చిన్నారుల కోసం ఆట వస్తువులను ఏర్పాటు చేయాలి. వేసవికాలంలో సాయంత్రం సమయాల్లో చిన్న పిల్లలతో సేదతీరడానికి వస్తే పార్కు పూర్తిగా ఎడారిగా మారింది. చెత్త చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలి. వెంటనే పార్కు మొత్తం శుభ్రం చేసి ఉపయోగంలోకి తీసుకురావాలి.
– కామేశ్వర్‌రావు, రాజేందర్‌రెడ్డి నగర్

విద్యార్థులకు ఎమ్మెల్యే సన్మానం



గచ్చిబౌలి: పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గొప్ప విషయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. కొండాపూర్‌లోని ప్రేమ్‌నగర్‌కు చెందిన సాయిరామ హైస్కూల్ విద్యార్థులు బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా 10/10 జీపీఏ సాధించిన విద్యార్థినులను ఆయన సన్మానించారు. ఆ తర్వాత వారందరికీ ఇంగ్లిష్ నిఘంటువులను అందించారు. అనంతరం మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించిన ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యం ఏర్పరచుకుని లక్ష్యం దిశగా అడుగులు వేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మాదాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, పాఠశాల కరస్పాండెంట్ సత్యగుప్తా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ‘మహబ్బత్ కీ దుకాన్’

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎన్ఎస్‌యూఐలో నూతన నియామకాలను చేశారు. మంగళవారం రాత్రి ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ‘మహబ్బత్ కీ దుకాన్’ పేరిట క్యాంపస్ నార్త్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ఇన్‌చార్జి మహ్మద్ ఫాహద్, హెచ్‌సీయూ ఇన్‌చార్జి అజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి రచనారెడ్డి, హెచ్‌సీయూ అధ్యక్షుడు నేహ జయరాజ్, ఇతర ఎగ్జిక్యూటివ్ సభ్యులు, కో– ఆర్డినేషన్ సభ్యులు పాల్గొని యువ న్యాయపత్రాలు, స్వీట్లను పంపిణీ చేశారు.

పీఓ, ఏపీఓల శిక్షణా కేంద్రం పరిశీలన

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులోని శ్రీచైతన్య హైస్కూల్లో నిర్వహిస్తున్న పీఓ, ఏపీఓల శిక్షణా కేంద్రాన్ని మెదక్ పార్లమెంట్ సాధారణ ఎన్నికల పరిశీలకులు సమీర్ మాధవ్(ఐఏఎస్) బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓలదే కీలక పాత్ర అన్నారు. ఎన్నికల నిర్వహణ సక్రమంగా ఉంటే ఎటువంటి కేసులు లేకుండా ఉంటాయని తెలిపారు. అనంతరం గుమ్మడిదల, పటాన్‌చెరులో ఉన్న చెక్ పోస్టు, ఏఆర్వో కార్యాలయంతో పాటు రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో ఉన్న స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. ఆయన వెంట ఏఆర్వో దేవుజా, మాస్టర్ ట్రైనర్ అమరేందర్‌రెడ్డి ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మియాపూర్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని బాలాజీనగర్ సమీపంలో ఫూట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని స్థానికులు 11.30 గంటలకు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. అప్పటికే మృతి చెందాడు. స్థానికులను ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. మృతుడికి సుమారు 45 ఏళ్లు ఉంటాయని, గత కొద్ది రోజులుగా ఫూట్‌పాత్‌పైనే పడుకుంటున్నాడని స్థానికులు పేర్కొన్నారు. అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రపంచ దేశాలకు విశ్వగురువుగా భారత్

అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి



పుస్తకావిష్కరణలో రచయిత శంతను గుప్తా, సంగీతారెడ్డి, సైనా నెహ్వాల్

గచ్చిబౌలి: దేశానికి పదేళ్లపాటు సుపరిపాలన అందించిన ప్రధాని నరేంద్రమోదీ పాలనను ప్రపంచ దేశాలు భారత్‌ను విశ్వగురువుగా చూస్తున్నాయని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో ప్రజ్ఞాభారతీ ఆధ్వర్యంలో రచయిత శంతను గుప్తా రాసిన ‘101 రిజన్స్ వై ఐ విల్ ఓట్ వర్ మోదీ’ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. మోదీ పాలనలో మౌలిక వసతుల అభివృద్ధి, అన్ని రంగాల్లో పురోగతి సాధించారన్నారు. పదేళ్లలో దేశముఖ చిత్రం పూర్తిగా మారిపోయిందని ఆమె పేర్కొన్నారు. ఈ పుస్తకం అద్భుతంగా ఉందని గ్రాఫిక్స్ చిత్రాలతో అందరిని ఆకట్టుకుంటుందన్నారు. ప్రముఖ బాడ్మింటన్ సైనా నెహ్వాల్ మాట్లాడుతూ.. మోదీ, యోగి ఆదిత్యనాథ్‌లకు తాను పెద్ద అభిమానినని పేర్కొన్నారు. యువ క్రీడాకారులకు కావాల్సిన వసతులను కలిపించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

చేవెళ్లలో బీజేపీ గెలుపును ఆపలేరు



బీజేపీ స్ట్రీట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



టెలికామ్‌నగర్ ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతలు

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: చేవెళ్ల ఎంపీ సీటును బీజేపీ గెలుచుకోవడాన్ని ఎవరూ ఆపలేరని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని బసవతారక్‌నగర్‌లో బీజేపీ స్ట్రీట్ మీటింగ్ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాశ్రేయస్సు కోసం పనిచేసే నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఓట్లకోసం రాజకీయాలు చేసే నాయకులు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఓవైపు ఉంటే ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి మరో వైపు ఉన్నారని గుర్తు చేశారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ఈ ప్రాంత అభివృద్ధిపై చిత్తశుద్ధితో కృషిచేసే వ్యక్తికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు వసంత్‌కుమార్ యాదవ్, మీన్‌లాల్‌సింగ్, శివసింగ్, తిరుపతి, కిషన్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గోపాల్ బబ్లూసింగ్, రాజు, శ్రీనివాస్, యాదయ్య, గోవింద్, ప్రసాద్, ఉమేష్, గంగాధర్ పాల్గొన్నారు.

టెలికామ్‌నగర్‌లో ప్రచారం..

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం బుధవారం రాత్రి నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ.. ఓటర్లకు పార్టీ కరపత్రాలను అందజేశారు. బీజేపీ జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, స్థానిక నాయకులు దినేష్‌యాదవ్, రవీందర్, అనురాగ్‌రెడ్డి, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే వేడుకలు



సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మియాపూర్: మియాపూర్‌లోని విద్యుత్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కార్మిక నాయకుడు జగదీష్ హాజరై కార్మికులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు శోభన్, మాణిక్యం, కృష్ణ, శివకృష్ణ, మహేందర్, నాగమణి, యశోద, శివనీల, బుచ్చమ్మ, కార్మిక సంఘం నేతలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో..



బొల్లారం ఎక్స్‌రోడ్డు ఆటోస్టాండ్ వద్ద..

మియాపూర్ డివిజన్ పరిధిలోని బొల్లారం ఎక్స్‌రోడ్డు ఆటోస్టాండ్ వద్ద గోల్కొండ తిమ్మరాజు, స్పందన సేవా సంస్థ అధ్యక్షులు శ్యామ్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్‌రెడ్డి హాజరై మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించుకున్నారు. ఆటో యూనియన్ నాయకులు తదితరులున్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట రూ.25, పచ్చిమిర్చి రూ.60, బెండకాయ రూ.40, కాకరకాయ 60, దొండకాయ 40, దోసకాయ 30, ఆలుగడ్డ 35, చామగడ్డ 50, కీర 35, బీర 60, వంకాయ 40, గోకరకాయ 50, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు రూ.80, ఉల్లిగడ్డ 25 (కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) రూ.30, సొరకాయ (కేజీ) రూ.20, అల్లం రూ.150, వెల్లుల్లి రూ.250గా ఉన్నాయి.

ఎర్లీబర్డ్ వసూళ్లు రూ.109.21 కోట్లు

శేరిలింగంపల్లి: ఎర్లీబర్డ్ స్కీమ్‌లో భాగంగా శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రాపర్టీట్యాక్స్ రూ.109.21 కోట్లు వసూలయ్యాయి. చివరిరోజైన మంగళవారం ఒక్కరోజే రూ.15.96 కోట్లు వసూలు చేసి జీహెచ్‌ఎంసీ పరిధిలోనే శేరిలింగంపల్లి సర్కిల్ అగ్రస్థానంలో నిలిచింది. ఎర్లీబర్డ్ సర్కిల్ పరిధిలో గతేడాది రూ.104 కోట్లు వసూలైనట్లు అధికారులు ప్రకటించారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం



బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన సంగీతారెడ్డి

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ పార్టీ కార్యాలయాన్ని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాసీ ఒడియా గ్రామిక సమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలో మరోసారి నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ళలో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

హెచ్‌సీయూ హ్యుమానిటీస్ డీన్‌గా ఆచార్య ప్రభాకర్‌రావు



రాయదుర్గం: హెచ్‌సీయూ హ్యుమానిటీస్ డీన్‌గా ఆచార్య జంధ్యాల ప్రభాకర్‌రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత మూడేళ్లుగా డీన్‌గా వ్యవహరించిన ఆచార్య కృష్ణ నుంచి ఈ బాధ్యతలను ఆయన చేపట్టారు. నూతన డీన్‌ను పలువురు ప్రొఫెసర్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో బాధ్యతలు నెరవేరుస్తామని, హ్యుమానిటీస్ విభాగం అభివృద్ధికి చేసే కృషిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. హెచ్‌సీయూ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, ఫిలాసఫీ విభాగ అధ్యక్షులు ఆచార్యులు వెంకటేశ్వరరావు, మురళీమనోహర్, సీహెచ్. అన్నపూర్ణ, అంబా కులకర్ణి, తరుణ్‌మోజీ, పమ్మిపవన్‌కుమార్, లక్ష్మీనారాయణ, పిల్లలమర్రి రాములు, గోనానాయక్, హైమావతి, డాక్టర్ పి. విజయ్‌కుమార్, సురేష్‌కుమార్, భవానీశంకర్ పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ



సూచనలు చేస్తున్న సాధారణ ఎన్నికల పరిశీలకులు రాజేంద్రకుమార్

గచ్చిబౌలి: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకులు రాజేంద్రకుమార్, ఏఆర్ఓ స్నేహ శబరీష్, రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌లు పరిశీలించారు. బుధవారం రిషీ కాలేజీలో అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీఓ, ఏపీఓల విధులు, బాధ్యతలు, రిపోర్టింగ్, తదితర అంశాలపై మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లు, ఈవీఎం , కంట్రోల్ ప్యానెల్ యూనిట్, ఎన్నికల శిక్షణ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు.

న్యూ ఎరా హైస్కూల్ విద్యార్థుల విజయకేతనం



ఆల్విన్‌కాలనీ: పదో తరగతి ఫలితాల్లో కూకట్‌పల్లి, వివేకానందనగర్‌లోని న్యూ ఎరా హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 23 మంది విద్యార్థులకు 10/10జీపీఏ సాధించి కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో టాప్ స్కూల్‌లో ఒకటిగా నిలిచిందని కరస్పాండెంట్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా 9.8 గ్రేడ్లు సాధించిన విద్యార్థులు 13 మంది, మొత్తం 260 మంది పరీక్షకు హాజరు కాగా అందులో 130 మంది విద్యార్థులు గ్రేడ్ పాయింట్లు 9.0 పైన సాధించారు. ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ, అకడమిక్ డైరెక్టర్ వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఫ్రిజ్ అమ్మకానికి పెట్టిన మహిళపై లైంగిక దాడి

బాధితురాలి ఫిర్యాదుతో జీరో ఎఫ్ఐఆర్

వెంగళరావునగర్: ఓఎల్ఎక్స్‌లో ఫ్రిజ్ అమ్మకానికి పెట్టిన మహిళపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... నగరానికి చెందిన మహిళ తన ఇంట్లోని ఫ్రిజ్‌ను అమ్మకానికి ఓఎల్ఎక్స్‌లో పెట్టింది. దీనిని చూసిన ప్రీతం అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తాను కొంటానని, ఫోన్ పే నెంబర్ అడిగి తీసుకున్నాడు. ‘వాట్సాప్‌లో డీపీ చూసి అందంగా, డీసెంట్‌గా ఉన్నావంటూ పొగిడాడు’. తనకు విడాకులయ్యాయని, పెళ్లి చేసుకుంటానని ఆమెకు చెప్పి మణికొండలోని తన ఫ్లాట్‌లో రెండుసార్లు శారీరకంగా కలిశాడు. ఈ విషయం ప్రీతం భార్యకు తెలిసి తన భర్తను కలిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆమెను హెచ్చరించింది. దీంతో అతడు ఆమె ఫోన్‌ను బ్లాక్ చేశాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం కేసును రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.